# మల్లె రేకు

-వేంపల్లి అబ్దుల్ ఖాదర్

**శాం**తి ఫక్కున నవ్వింది!

సంపెంగలాంటి సన్నని మెళ్లో బొట్టుగొలుసు తళుక్కున మెరిసింది!

ఆ మెరుపు గుండెలోతుల్లోకి జారిపోయింది.

అన్నట్టు....శాంతి గొప్ప అందగత్తేంకాదు.

చాలా సాదాసీదాగా వుంటుంది.

చాలా సాదాసీదాగా ఉన్నా - ఆ నిరాడంబరతలో ఏదో చెప్పలేని ఆకర్షణ ఉంది.

ఆ నవ్వులో చావుకోరే మనిషి బ్రతుకులోనైనా ఆశలు పెంచే పవరుంది.

ఆ నవ్వే......ఆర్నెల్లుగా బెడ్డుమీదున్న భర్తకు సేవ చేసింది.

ఆ నవ్వే.....ప్రేమ వివాహంతో పుట్టింటికి దూరమైనా, ఆ బాధను భరించగలిగింది.

శరీరానికి సరే - మరి మనసుకు తగిలిన గాయాల మాటేమిటి?

టానిక్ తాగనని చిన్న పిల్లాడల్లే మారాం చేస్తున్న రాజేంద్రను చిరునవ్వు నవ్వుతూ శాంతి ఒడిలోకి తీసుకుంది.

కార్కు తీసి స్పూన్‌లోకి టానిక్ పోసింది.

వాసన.

ఒకటే వాసన.

శాంతి ఆ వాసనని భరించలేక తల తిప్పుకుంది.

ఎందుకో ఆమెకీ మధ్య టానిక్ వాసనంటే బొత్తిగా పడ్డంలేదు.

"కడుపులో ఒకటే వికారంగా ఉంది......" అంతలోనే బళ్లున డోక్కుంది.

"ఆ టానిక్ జోలికి వెళ్లొద్దని నీకెన్నిసార్లు చెప్పాను. ఇప్పుడు చూడు. పేగులు తెగేలా ఎలా డోక్కున్నావో?" అని గట్టిగా శాంతి చెవులు మూశాడు రాజేంద్ర. "నాకన్నీ చూడ్డంలో అర్థం ఉంది. అందుకని నీ ఆరోగ్యం పాడు చేసుకోడంలో అర్థమేముంది?.......ఇవ్వాళ నుంచి నా పన్లేవీ నువ్వు చూడక్కర్లేదు. ఇప్పుడిప్పుడు నేను లేచి నడవగలుగుతున్నాను గదా?" అన్నాడు మళ్లీ.

శాంతి చివ్వున రాజేంద్ర ముఖంలోకి చూచింది. ఆమె కనురెప్పలు టపటపా కొట్టుకున్నాయి.

"దయచేసి ఇంకెప్పుడూ అలా అనకండి. మీకోసం కాదు, నేను నాకోసమే ఇలా చేస్తున్నాను."

ఎప్పటి మల్లెనే నవ్వింది శాంతి. కానీ ఎప్పటిలా కాకుండా ఈసారి చెక్కిలి మీదికి కన్నీళ్లొచ్చాయి. మగడి గుండెల మీద గువ్వలా ఒదిగిపోతూ "వెనకా ముందూ బంధాలన్నీ తెంచేసుకుని కొండంత అండగా మిమ్మల్నే నమ్ముకుని వచ్చేశా. నా కర్తవ్యం ముందు నన్ను నిస్సహాయురాల్ని చెయ్యొద్దు....."

రాజేంద్ర గుండె మంచుముక్కలా కరిగిపోయింది.

మనసులు కలబోసుకోడం ముఖ్యంగానీ - అవి పెద్దల కూర్చినవైతేనేం? ప్రేమ వివాహాలైతేనేం?

***

నెల్రోజుల తర్వాత-

ఓ గోర్వెచ్చని సాయంకాలం-

అలా షైరగాల్లోకి షైరొళ్ళొచ్చిన రాజేంద్ర - లైట్ స్విచ్ వేసి ఇంట్లో అడుగుపెట్టాడు. అక్కడ కంటబడిన దృశ్యం ఆతన్ని నిలవేసింది. బాహ్య స్పృహ మరచి రాస్తున్న శాంతి ముఖంలో అలసట కనిపిస్తోంది. నవల ముగింపులో ఉంది కాబోలు.

తన భార్య ..... రచయిత్రి!

రచయిత్రి కావటం ఎంత అదృష్టం?

అందుకు తను ఇవ్వగలిగినంత సహకారం ఇస్తున్నాడా?

మనస్ఫూర్తిగా ప్రోత్సహిస్తున్నాడా?

కాని శాంతి మాత్రం తన నవలకి తొలిపాఠకుడు, తొలి విమర్శకుడు భర్తే నంటోంది!

ఇంకా పూర్తి కాని ఆ నవల్ని ఇదివరకే చదివాడు.

శాంతి నవల్లోని పాత్రలు చాలా 'మైల్డ్‌గా' ఉంటాయి. తిరగబడకపోతే మానె. కనీసం ప్రతిఘటించనైనా ప్రతిఘటించవు.

అదేమని అడిగితే – 'మనసున్న మనిషికి తాను తప్పు చేశానన్న శిక్ష ఒకటి చాలు. జ్వాలలా జీవితమంతా దహించదానికి దానికంటే పెద్దశిక్ష ఏ న్యాయస్థానాలు విధించగలవ్?' అంటుంది.

ఏమిటో ఈ ఫిలాసఫి ?

ఎందుకనో అలాంటి సమాధానాలు అంతగా రుచించవ్ రాజేంద్రకి. 'మనిషికి నిజంగా అంత మంచి మనసే ఉంటే తప్పెందుకు చేస్తాడు' అన్నది అతని అభిప్రాయం.

"లైటైనా వేసుకోలేదే. చీకట్లో ఎలా రాయగలుగుతున్నావ్?"

"మంచి ముగింపుకోసం తీవ్రంగా ఆలోచిస్తున్నాను. ఆలోచన్లు చెదిరిపోతాయో మోనని వేసుకోలేదు. ఇంతలో మీరు వెలుగులా పరచుకున్నారు."

"వెలుగులోకొచ్చే రచన్ని చీకట్లో రాయాలనుకుంటున్నావేమో ననుకున్నా".

"రాసినా ఫరవాలేదు."

"ఏం? ఎందుకని?"

"సమాజం. సమాజం అనబడే ఈ మనుషుల్లో కొంత మంది చీకట్నే ప్రేమిస్తూ ఉండటంవల్ల."

"అని ఎందుకనుకోవాలి? ఒకవేళ అలా అనుకున్నా రచయిత్రిగా నువ్వీ మురికిని కడిగేయగలవా?"

"మార్పన్నది హఠాతుగా ఎక్కడినించో ఊడిపడదు. ఆ పరిణామక్రమంలో నాదో తీవ్ర ప్రయత్నమైతే చాలు"

"ఇంతకీ నువ్వు రాస్తున్న నవలేవిటి?"

"ఒక జీవిత సత్యం"

"జీవిత సత్యమైనా నవలగానే రాస్తున్నావుగదా!"

"నవలగా రాయదగ్గది జీవిత సత్యమే కానక్కరలేదు"

"నీ నవలా నాయిక 'ఓ ఫజిల్'. ఓ పట్టాన ఎవరికీ అర్థంగాదు. అర్థంగాని పాత్రలతో నవల రాసి నువ్వేం ప్రయోజనం సాధిస్తావ్?"

శాంతి నోరు విప్పలేదు. ఓ పొడినవ్వు. ఆ నవ్వుకు ఎన్నెన్ని అర్థాలో!

మొన్నీమధ్య బజారెళ్లినపుడు ఎదురైన సంఘటనే శాంతి నవలకి ఆధారం. ఆమె పేరు సుజాతట. వయసు పదహారు. మగవాసనకి చాలా దూరంగా ఉన్న మనిషి, కానీ ఒకానొక దౌర్భాగ్యమైన క్షణం ఆమె పాలిట శాపంగా మారింది. ఒక మానవ మృగం ఆమెని చాలా పాశవికంగా వేటాడింది. నాలుగో నెల్లో భ్రూణహత్యా ప్రయత్నం విఫలం. గార్డినాల్. ఆత్మహత్య. అమ్మాయి పిడికిట ఉత్తరం. సభ్య సమాజం మీదికి విసిరిన ఓ సవాల్ మరణం.

ఈ విషాద ఘటన శాంతి మనసును కలచివేసింది.

రాత్రింబవళ్లు ఆమె కలం కళ్లలో కొవ్వొత్తుల్ని వెలిగించుకుంది.

రెండు నెలల్లో నవలకి తుదిరూపం వచ్చింది.

ముగింపు విషయంలో ఇంకా తుది నిర్ణయం జరగలేదు.

నిజ జీవితంలో సుజాత తీసుకున్న నిర్ణయం రాజేంద్రకు నచ్చలేదు. అందుకు కారణం కూడా చెప్పాడు. ఏ నవలా నాయిక అయినా పరిస్థితుల నుండి పారిపోయే పిరికిది కాకూడదు. సమస్యలకు చావే పరిష్కారంకాదు. వీరోచితంగా పోరాడ్డమే జీవితం అని.

"ఆత్మాభిమానంగల ఆడది తను చేయని తప్పుకు బ్రతికుండే క్షణక్షణమూ చిత్రహింస అనుభవించాలా?" అని ప్రశ్నించింది శాంతి.

రాజేంద్ర వాదనలోకి దిగాడు.

"తన ప్రమేయం ఉన్నా లేకపోయినా జరిగిన తప్పు ఎలాగూ జరిగిపోయింది. జీవితాన్ని గొప్పగా అవగాహన చేసుకోడానికి ప్రయత్నించాలిగానీ ప్రతి చిన్న విషయానికీ ఆవేశపడిపోతే ఎన్నిసార్లని జీవితానికి వీడ్కోలు చెబుతాం? ఆధునిక మహిళ



ఇలా భావించే స్థితిలో లేదు. పరిస్థితుల్ని తనకి అనుకూలంగా మలుచుకోడంలోనే విజ్ఞత ప్రదర్శిస్తుంది. ఈ ఎలిమెంట్‌ని ఇలాగే ఎందుకు ఎలివేట్ చేయకూడదు?"

"చెయ్యొచ్చు కానీ రాజీపడిపోవడం మాత్రం జీవితమా? రాజీ సూత్రం పరాజయానికి తొలిమెట్టు."

"ఇంతకీ నవల్ని ట్రాజడీ చెయ్యడమే నీ ఉద్దేశమా?"

"ముగింపు విషయంలో ఇంకా ఏ నిర్ణయమూ తీసుకోలేదు"

"నిజ జీవితంలో సుజాత ఎలాగూ చచ్చింది.

కానీ నవల్లో మాత్రం చంపకు. ఆ పాత్రను చంపడం కంటే బ్రతికించడంలోనే ఔచిత్యముంది."

"చావులాంటి బ్రతుకు అదీ ఒక బ్రతుకేనా?.... అలాంటి బ్రతుకు ఆత్మాభిమానంగల ఏ ఆడపిల్లా కోరుకోదు. కుక్క ముట్టిన కుండగా మిగలడం సుజాతకు సుతరామూ ఇష్టంలేదు. సుజాత చాలా సెన్సిటివ్. ఈ కాలం ఆరిందా ఆడపిల్లలకు ప్రతినిధి"

"చచ్చి సాధించేదేవిటో తెలియనివాళ్ళు ప్రతినిధులా? పోనీ అలాంటి చావు-మళ్లీ అలాంటి సంఘటనలు జరక్కుండా ఆపగలుగుతుందా? ఆపగలిగితేనే ఆ ముగింపు బాగుంటుంది. లేకపోతే నవల సాధించే ప్రయోజనం సందేహమే."

"మంచితనం, మానవత్వం మీద నమ్మకం చెడినప్పుడది ఆలోచిద్దాం. పొరబాట్లో తప్పులో చెయ్యని వాళ్లు లోకంలో ఎవరున్నారు? మీరన్నట్లు విజ్ఞతని మేల్కొల్పడానికి ఒక చావు కారణమైతే అది కూడా గొప్ప ముగింపే అవుతుంది."

ఇంటిముందు ఇండికా ఆగింది.

డాక్టర సూర్యం కారు దిగాడు.

రాజేంద్ర ఎదురెళ్ళి సాదరంగా ఆహ్వానించాడు.

పిచ్చాపాటీ మధ్య ఓ నిమిషం గడిచింది.

చెకప్ పూర్తయింది.

"యువార్ పర్ఫెక్ట్‌లీ ఆల్‌రైట్ మిస్టర్ రాజేంద్రా! ఇక వారం రోజుల్లో నార్మల్ డ్యూటీస్‌కి అటెండ్‌కావచ్చు. నెలకోసారి చెకప్‌కొస్తే చాలు. అన్నట్టు....క్రమం తప్పకుండా మందులు ఉపయోగించాలి. నిజానికి మీరింత త్వరగా కోలుకోడానికి నా ట్రీట్‌మెంట్ కంటే - మీ శ్రీమతి సర్వీసే ముఖ్యం!.... అన్నట్టు మిసెస్ రాజేంద్ర కనిపించరేం?...."

"నమస్తే డాక్టర్!"

చంకన నీళ్ల బిందెతో గుమ్మం ఎక్కుతోంది శాంతి. తడిసిన చీరకుచ్చిళ్లు. ఊగాడే ముంగురులు. అలసట అద్దుకున్న ముఖంలో పలచటి చిరునవ్వు. ఆ చిరునవ్వు అంచున భర్త ఆరోగ్యం పట్ల తపన. ఐనా....ఏ చిరునవ్వు వెనక ఎంత విషాదం దాగుందో?...

డాక్టర్ విస్తుబోయాడు. "రాజేంద్రా! మీ శ్రీమతి ఆరోగ్యం బాగోలేదా?"

"మీరైనా చెప్పండి డాక్టర్. నన్ను మళ్లీ మనిషిని చెయ్యడం కోసం తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసోంది"

"ఈజిట్?...జనరల్ వీక్‌నెస్ అయ్యుంటుంది. నాల్రోజులు రెస్ట్ తీసుకుంటే సరిపోతుంది...."

డాక్టర్ కారు దగ్గరకి నడిచాడు. స్టీరింగ్ ముందు కూచుంటూ "అన్నట్టు రాజేంద్రా! మీ దంపతులీమధ్య ఘర్షణేమైనా పడ్డారా?"

"ఏం డాక్టర్ అలా అడిగారు?"

"మానసికంగా ఆమె బాగోలేదేమోనని......"

"అయ్యుండొచ్చు? మొన్నో ఇన్సిడెంట్ చూసింది. అప్పట్నుంచీ....."

"ఇన్సిడెంటా? ఏంటది?"

"ఏవుందీ ? నరికొత్త పాతకథ. పాలవెన్నెల్లాంటి సౌశీల్యం పైశాచిక వ్యామోహానికి బలైపోయిందిట...."

"మైగాడ్ ! ....." అంటూ డాక్టర్ గాఢంగా నిట్టూర్చి, చూశావా రాజేంద్రా! హ్యూమన్ వాల్యూస్ ఎంత తారుమారైపోతున్నాయో. మనిషి ఎంత చదివినా, ఎన్ని సాధించినా, ఎంత నవనాగరికుడైనా - ఆ పర్టిక్యులర్ వీక్‌నెస్‌కి బానిసైపోతున్నాడు. నాగరికత ముసుగులో మనిషి లోపల మనిషిని దాచేస్తున్నాడు ! ....జీవితాన్ని ఆంక్షలమధ్య అందంగ గడిపేసున్నాడు.

అన్నట్టు....దీనికే మీ శ్రీమతి ఆరోగ్యానికీ ఏవిటి సంబంధం?.....

"ఉంది. రచయిత్రి కదా! చలించిపోయింది. ఆ సంఘటన ఆమె మనసు మీద గాఢమైన ముద్ర వేసింది. అమానవీయ విలువల మీద అందుకే ఆమె కలం నిద్రలేచింది."

"అలాగా ! వెరీగుడ్ ! ....రూసో కలం చేసిందీ ఆ పనే. కాకపోతే పోలిటిక్స్‌లో ! .....అన్నట్లు ఆ నవల పేరు?"

"రాలిన మల్లెరేకు"

"గుడ్. మెరుపులాంటి టైటిల్. ఎంత యాప్ట్‌గా ఉంది! ఎంత టచింగ్‌గా ఉంది! .....రాజేంద్రా!

ఇక్కడ నీకోమాట చెప్పనా ! మోడరన్ లిటరేచర్ మీద మాంచి టేస్టుందోయ్ నాకు! ఆ ట్రాకులోనే వెళతా మొర్రో అంటే – 'ఛస్.... స్టెత్ పట్టుకోరా' అని నన్ను ట్విస్ట్ చేశారు మా డాడీ!..... చెప్పొచ్చేదేవిటంటే..... ఆ సరదా ఎటూ తీరలేదు. ఇప్పుడిహ పుస్తకాలు చదవటం, అచ్చెయ్యటం హాబీగా పెట్టుకున్నా, ఆ నవల్ని నాకు అంకితం చెయ్యరూ ప్లీజ్ ! అచ్చేయిస్తాను!"

రాజేంద్ర అబ్బురపడ్డాడు ! మీలో ఇంత సాహిత్యలాష ఉందా డాక్టర్! ఎంత మంచి కబురు చెప్పారు. మీమేలు ఈ జన్మలో....."

"స్టాప్ స్టాప్. జన్మరాహిత్యం మీద ఎందరో ఎన్నో కలలు గన్నారోయ్. నువ్వా వేళ ' డెత్ ఈజ్ ఫర్ రీబర్త్' అంటే ముందు ముందు ఏ జన్మలోనూ నా ఋణం తీర్చుకోకు! ......అండర్ స్టాండ్!"

"ఎస్ డాక్టర్ ! శాంతితో ఇవ్వాళే మాట్లాడదాను!"

"దట్స్ గుడ్. వెళ్లొస్తా"

✤✤✤

రోజులు వారంలోకి తిరిగాయి –

రాజేంద్ర ఆరోగ్యం కుదుటపడింది–

తను మళ్లీ మనిషిగా తిరుగాడ్డానికి వీలయ్యేదా ఈ ఆర్నెల్లు శాంతి కంటికి రెప్పలా కాపాడకపోతే? లవ్ మారేజన్న మాటే గాని నిజంగా శాంతిని తాను సుఖపెట్టిందెపుడు? వయసు మనసులో పండిపోయిన వ్యక్తిత్వం ఆమెది. తను ఇహ ఆమెను కాపాడుపోవాలి......

హారన్ మధ్య ఇండికా వచ్చి ఇంటిముందు ఆగింది. కారు దిగుతున్న డాక్టర్ మెళ్లో స్టెత్ ' హౌ ఆర్ యూ' అని పలకరించింది రాజేంద్రని.

"కులాసానే డాక్టర్! కానీ .....శాంతి డిప్రెషన్‌లో ఉంది....."

"ఈజిట్? డా॥ మురళీధర్ నా ఫ్రెండే. మాంచి సైక్రియాటిస్ట్ పిలిపించనా?...."

"వద్దు డాక్టర్...."

"ఏం?...."

# నానీలు

**రా**త్రి పగలు
సంయోగం చెంది
ఎర్రని సంధ్యను
జన్మనిచ్చాయి.

**చం**ద్రుడు
వెన్నెలతో కవ్విస్తాడు
కలువను
వికసింపజేయాలని

**భూ**మాత
పులకరించిపోయింది
వరుణుడి
పలకరింపుకు

**గె**లుపు గులాబి
పొందాలంటే
గుచ్చే ఓటమిల ముల్లుల్ని
భరించాలి

**క**డలిలో
తరంగాల వలె
అంతరంగంలో ఆశలు
పుట్టుకొస్తాయి.

**నీ**టి కొలనులో
చంద్రుడు తొంగి చూశాడు
పట్టుకోబోతే
చెదిరిపోయాడు.

**వా**హనాలు కూడా
మాట్లాడుతాయి
చీకటి రోడ్డుపైన
సిగ్నల్ లైట్లతో

**మ**నసు
ప్రశాంతంగా ఉండాలంటే
గుండె గది
విశాలంగా ఉండాలి.

–పసుపురెడ్డి ప్రకాశరావు

"తన అభిప్రాయాన్ని నేను గౌరవిస్తాను"

"వద్దన్నారా?"

"ఔను"

"ఔనో కాదో నిర్ణయించాల్సింది డాక్టర్లుకదా!"

"ప్లీజ్ ఆ విషయమిక వదిలేద్దాం"

"అలాగే. మరి నే వచ్చినపని ఏవిటని అడగరా?"

"శాంతి ఇవ్వాళే ముగింపు రాసింది నవలకి"

"వెరీగుడ్! ఐతే మూడు వారాల్లో నవల అచ్చై మీ చేతుల్లో ఉంటుంది!"

ఇద్దరూ లోపలకొచ్చారు.

"శాంతీ ......." పిలిచాడు రాజేంద్ర. ఆ వేళప్పుడు కొళాయి దగ్గరకి వెళ్లుంటుందని గుర్తొచ్చి ఊరుకున్నాడు. పాలబ్బాయి రాగానే స్టౌవ్ వెలిగించాడు. వెలిగించిన సిగరెట్‌ని పూర్తిచేసి "నో ఫార్మాలిటీస్. కాఫీ కానిచ్చా. లేడీస్ లేరుగా! మీకెందుకు శ్రమ?"

"శ్రమ అనుకుని ఉంటే మీరు నన్ను మళ్లీ మనిషిని చేసేవారా? దాని ముందు ఇదెంత?"

"భలే వారే. ఫ్రీగా చేశానా ? ఫీజు తీసుకున్నాగా? అది సహాయం ఎలా అవుతుంది?"

"తీసుకున్న ఫీజెంత. నామినలేగా?"

"మీరిలా ఎడాపెడా మొహమాట పెట్టేస్తుంటే......"

"పెట్టనులెండి"

"దట్స్‌గుడ్!"

స్టౌవ్ నుంచి పాలు దించబోతున్న రాజేంద్ర ఆగిపోయాడు.

"వాట్ హాపెండ్....?"

"పాలు విరిగినట్టున్నాయి...."

"నో ప్రోబ్లమ్. ముందు మీ శ్రీమతి నడిగి నవల తీసుకోండి. కంగ్రాట్స్ చెబుదాం!"

పక్కింటి పార్వతమ్మ గుమ్మంలోకి తొంగిచూస్తూ "శాంతి కొళాయి దగ్గరకు రాలేదు. ఒంట్లో బాగోలేదా నాయనా?" అని అడిగింది.

'ఇంకెక్కడికి వెళ్లుంటుంది చెప్మా?' అని రాజేంద్ర ఆలోచనలో పడ్డాడు. ఆ ప్రయత్నంగానే ఆతని కాళ్లు దాబా, మీదికొచ్చాయి. శాంతి అక్కడుంది. నిర్మలంగా ఉంది. నిశ్చలంగా ఉంది.

శాంతి పల్స్ చూచి చేయి వదిలేశాడు డాక్టర్.

కొన్ని స్లీపింగ్ టాబ్లెట్స్ నేల మీద చిందర వందరగా పడి వున్నాయి.

బాటిల్ దొర్లి ఎక్కడో పడి ఉంది.

డాక్టర్, షాక్ నుంచి తేరుకుంటూ "ఈ ఆత్మహత్యకి కారణం మీకు తెలుసా రాజేంద్రా?...." అనడిగాడు. ఏం తెలుసునని చెబుతాడు సమాధానం?

చనిపోయిన శాంతి చెయ్యి టీపాయ్‌ని తాకుతోంది.

టీపాయ్ మీద పూర్తిచేసిన నవల వుంది.

నవల మీద చప్పరించిన రెండు నిమ్మబద్దలున్నాయ్.

"శాంతి ప్రెగ్నెంటా?...." డాక్టర్ విస్తుబోయాడు!

ఆర్నెల్లుగా దాంపత్య జీవితానికి దూరంగా ఉన్న రాజేంద్ర ఆ కటిక నిజాన్ని జీర్ణించుకోలేక పోయాడు.

టానిక్ వాసన.....

శాంతి.....

డోకులు......డోకులు.....డోకులు.....

సుజాత.....శాంతి.....

శాంతి.....సుజాత.....

ఉన్నచోటే శిలైపోయాడు రాజేంద్ర.

ని.....శ్చ.....బ్దం

శాంతి చావుకు కారణం?

రాజేంద్రకూ తెలీదు......

లోకుల కసలే తెలీదు......

డాక్టర్ సూర్యంలోని పశుప్రవృత్తికి తప్ప .....

■